సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024




ఎన్నికల్లో ఎన్ని వింతలో..
సాగునీటి సంఘాల ఎన్నికల్లో కొందరి ఇష్టారాజ్యం సాగుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇలాకా.. పిఠాపురంలో జరుగుతున్న ఈ తంతుపై రైతులు మండిపడుతున్నారు.

8లో



పురుగు మందు తాగి వ్యక్తి మృతి
సకాలంలో వైద్యం అందక పురుగు మందు తాగిన వ్యక్తి మృతి చెందాడంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4,500, సెంట్రల్ 1,500, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను వదిలారు. సముద్రంలోకి 6,384 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం రూ.33.35 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 42 రోజులకు గాను హుండీల ద్వారా రూ.33,35,485 ఆదాయం లభించింది. 20 గ్రాముల బంగారం , 120 గ్రాముల వెండిని భక్తులు కానుకలుగా సమర్పించారు. అమలాపురం దేవదాయ, ధర్మదాయ శాఖ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సేవా సంఘాలకు చెందిన సేవకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజనకరంగా సహకార సంఘాలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు బహుళ ప్రయోజనకరంగా ఉండాలని జేసీ టి.నిషాంతి అన్నారు. గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ, సంయుక్త వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ సహకార సంఘాల్లో ఇతర వ్యాపారాలైన పెట్రోల్ బంకుల నిర్వహణ, జన ఔషధి కేంద్రాల ఏర్పాటు తదితర వాటిని అందుబాటులోకి తేవాలన్నారు. కమిటీ కన్వీనర్, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, నాబార్డ్ డీజీఎం స్వామినాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు
ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని జేసీ నిషాంతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని మిల్లర్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి గోనె సంచుల సరఫరా, హమాలీల ఏర్పాటు, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం నివారణ, కనీస గిట్టుబాటు ధరల కల్పన అంశాలపై సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో తేమ శాతాన్ని కొంతమేర సడలించారని, తేమ శాతం పేరున మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తరుగు విధించరాదని సూచించారు.

విజిలెన్స్ కమిటీ సమావేశం వాయిదా

అమలాపురం రూరల్: అమలాపురం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించాల్సిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం వాయిదా పడిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పి.జ్యోతిలక్ష్మీదేవి గురువారం పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం ఉండడంతో ఈ సమావేశాన్ని వాయిదా వేశామన్నారు.

సర్కారు వారి దగా..

- కూటమి తెచ్చిన కల'వరి'పాట్లు
- డెల్టా రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- జిల్లాలో మొదలైన రబీ సీజన్
- రూ.20 వేల పెట్టుబడి సాయంపై నోరు మెదపని చంద్రబాబు
- ఆరు నెలలైనా అందని సూపర్ సిక్స్ పథకాలు
- నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై ధర్నా



భారీ వర్షాలకు నీట మునిగిన వరి చేలు (ఫైల్)

సాక్షి, అమలాపురం: హామీలు ఇవ్వడం, ఆనక వదిలేయడం చంద్రబాబు ప్రభుత్వానికి కొత్తేమీ కాదు.. అన్నదాతలను నష్టాల ఊబిలోకి దించేయడమే పనిగా ఇప్పటి 'కూటమి' సర్కారు ముందుకు సాగుతోంది.. విత్తు నుంచి పంట విక్రయం వరకూ ఎన్నో అవస్థలు పడుతున్న పుడమి పుత్రులను తీవ్ర నష్టాల్లోకి నెట్టేస్తోంది. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలతో కుదేలవుతున్న వారికి ఆపన్న హస్తం అందించకుండా దగా చేస్తోంది. ఇలా ఖరీఫ్ దిగుబడి సగటు కన్నా తగ్గడం.. నిండా ముంచిన వర్షాలు.. ప్రభుత్వం పంట నష్ట పరిహారం ప్రకటించకపోవడంతో రైతులకు అప్పులే మిగలనున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీల్లో ప్రధానమైన అన్నదాత సుఖీభవలో రూ.20 వేలు అందించకపోవడంతో రబీ సాగు పెట్టుబడులకూ అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరిగింది. సగటు దిగుబడి 21.75 క్వింటాళ్లు (29 బస్తాలు, బస్తా 75 కిలోలు) కాగా, తీర ప్రాంత మండలాల్లో దిగుబడి 14 క్వింటాళ్లు కూడా దాటడం లేదు. పండిన చోట కోతల సమయంలో వర్షాలు కురవడంతో చేలు నీట మునిగాయి. దీని వల్ల దిగుబడి గణనీయంగా తగ్గింది. తేమ ఉన్న ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం, మిల్లర్లు ముందుకు రాకపోవడంతో రైతులు అయినకాడకు అమ్ముకోవాల్సి వస్తోంది. చివరిలో కురిసిన వర్షాల కారణంగా యంత్రాలతో కోతలు వీలు కాక, కూలీలతో కోయించాల్సి వచ్చింది. దీనివల్ల అనుకున్న పెట్టుబడి కన్నా ఎకరాకు అదనంగా రూ.7 వేలు అయ్యింది. ఈ కారణంగా ఖరీఫ్ రైతులకు నష్టాలను చూపించింది.

కొత్తపేట, ఆలమూరు, రామచంద్రపురం సబ్ డివిజన్లలో కొంత వరకూ దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఇక్కడ రైతులకు కాస్త ఊరట కలిగింది. కానీ దిగువన అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో రైతులకు ఖరీఫ్ చేదు ఫలితాలను మిగిల్చింది.

సాగుకు ప్రోత్సాహం అందించాలి



మాకు ఖరీఫ్, రబీలో పెట్టుబడులు అధికం. గత ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.13,500 ఇవ్వడం, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ ఇలా పలు రకాలుగా మేలు చేసింది. దీనివల్ల పెట్టుబడి తక్కువగా ఉండేది. ఈ ప్రభుత్వం కూడా ఇలానే మాకు ప్రోత్సాహకాలు అందించాలి.

– గుస్సం రామకృష్ణ, రైతు, కొత్తూరు, రామచంద్రపురం మండలం

రబీ పెట్టుబడి ఎలా..
గోదావరి డెల్టాలో ఖరీఫ్ కన్నా రబీలోనే పెట్టుబడి అధికం. ఇక్కడ ఎకరాకు పెట్టుబడి రూ.42 వేల వరకూ అవుతోంది. కాలువల వ్యవస్థ అధ్వానంగా ఉన్నందున శివారు, మెరక ప్రాంతాల్లో పంట చేలల్లో మోటార్లతో నీరు తోడాల్సి వస్తోంది. ఇటువంటి చోట పెట్టుబడి రూ.50 వేల పెట్టాల్సి వస్తోంది. ఖరీఫ్ పండిన చోట పెద్దగా లాభాలు లేకపోవడం.. పండని చోట నష్టాలు రావడంతో రైతులు రబీ పెట్టుబడులకు అప్పులు చేయాల్సి పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడికి ఇస్తానన్న ఆర్థిక సాయం రూ.20 వేలు అందిస్తే ఊరటగా ఉంటోంది. ఇలా జిల్లాలో 1,45,890 మంది రైతులకు ఈ ఏడాది రూ.204.24 కోట్ల సాయం అందించాలి.

ఎన్నికల ముందు ఊదరగొట్టి..
ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబుతోపాటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకులు ప్రచారంలో ఊదరగొట్టినా రైతులకు మాత్రం పెట్టుబడి సాయం అందించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం ఇస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో కలిపి ఏటా క్రమం తప్పకుండా మూడు దఫాలుగా రూ.13,500 అందేది. ఇది చిన్న, సన్నకారు రైతులకు ఖరీఫ్, రబీలలో పెట్టుబడికి ఊతంగా ఉండేది. ఇప్పుడు పెట్టుబడులకు సొమ్ము అందే పరిస్థితి లేక అప్పులు చేయాల్సి వస్తోంది.

అడుగడుగునా దగా
దళారీల వ్యవస్థను ప్రభుత్వమే దగ్గరుండి ప్రోత్సహిస్తోంది. ఈ స్థితిలో దిక్కుతోచని రైతన్న అయినకాడికి అమ్ముకుంటూ ఉసూరుమంటున్నాడు. అకాల వర్షాలతో రంగుమారిన, తడిసి ముద్దయిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. తేమ పేరుతో లెక్కలు వేసి రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తుంది.

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ప్రీమియం రైతులే కట్టుకోవాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఇది రైతులకు మరింత భారం అవుతోంది. ఈ కారణంగా పంటల బీమా రాష్ట్రంలో చాలా మంది రైతులకు లభించే అవకాశం లేకుండా పోతోంది.
- జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం కేవలం 2.30 టన్నులు మాత్రమే. ఇది పూర్తి కావొస్తోంది. ఇంకా రైతుల వద్ద ధాన్యం మిగిలే ఉంది.

రూ.20 వేలు వెంటనే ఇవ్వాలి



అధికారంలోకి వస్తే రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. వెంటనే ఆ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతాంగానికి పెట్టుబడికి ఢోకా లేకుండా చూడాలి. లేకపోతే వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది.

– మరివాడ సూరిబాబు, కపిలేశ్వరపురం

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చి ఉచిత బీమా పథకం అమలు చేసిన తరువాత ప్రతి ఒక్కరూ బీమా పరిధిలో ఉండేవారు. పంట పోయినా మూడు నెలలకు పెట్టుబడి రాయితీ, తరువాత బీమా పరిహారం వచ్చేది. ఇప్పుడు బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని చెప్పడం సరికాదు. ప్రభుత్వమే చెల్లించాలి.

– సూరిశెట్టి బాబీ, మగటపల్లి, మలికిపురం మండలం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు జరిగిన మేలు

పథకం	లబ్ధిదారులు	అందిన లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	1,45,890	(ఏడాదికి సగటున) 482.58
వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ	1,07,272	15.63
పెట్టుబడి రాయితీ	1,08,176	93.37
ఉచిత పంటల బీమా	2,83,745	(ఏడాదికి సగటున) 1,105.41
వైఎస్సార్ పంటల బీమా	72,267	1.31
వైఎస్సార్ పశు నష్ట బీమా	482	1.28



తడిసిన పనలు తెస్తున్న కూలీలు (ఫైల్)

సూపర్ సిక్స్ మోసం

- అర చేతిలో వైకుంఠం చూపించిన విధంగా ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు వాటి ఊసెత్తడం మానేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలును కొండెక్కించారు. ప్రధానంగా రైతుకు ఆర్థిక సాయంతోపాటు మరికొన్ని హామీలను అమలు చేయలేదు.
- జిల్లాలో 1,68,000 మందికి తల్లికి వందనం పేరిట సుమారు రూ.252 కోట్ల వరకూ అందించాలి.
- నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించడం లేదా నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. 4.80 లక్షల మందికి రూ.864 కోట్ల భృతి ఇవ్వాలి.
- మూడు ఉచిత సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించారు. జిల్లాలో 3.90 మందికి అందాలి. ఈ పథకం ద్వారా మహిళలకు రూ.97.46 కోట్ల మేర రాయితీ అందించాలి. ఇప్పటి వరకూ గ్యాస్ పొందిన వారిలో పది శాతం మందికి కూడా రాయితీ పడలేదు.
- మహిళలకు నెలకు ఇస్తానన్న రూ.1,500 సొమ్ము ఊసేలేదు. ఈ పథకంలో 6,03,000 మందికి ఏడాదికి రూ.1,094.52 కోట్లు ఇవ్వాలి.
- ఆర్టీసీ ఉచిత ప్రయాణం ఇప్పటికీ మొదలు కాలేదు. ఉచిత ప్రయాణం కోసం జిల్లాలో 9.10 లక్షల మంది ఎదురు చూస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా

కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అందజేయనున్నారు. పార్టీకి చెందిన మాజీ ఎంపీ, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

డిమాండ్లు ఇవే..
- తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి.
- సూపర్‌సిక్స్ పథకాల హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి.
- ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలి, దళారీ వ్యవస్థను తొలగించాలి.
- తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి, తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలి.
- ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి. రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలి.

సంస్కృతీ సంప్రదాయాలతోనే సమాజ వికాసం



భారతీయ సంస్కృతీ ఉత్సవ్ పోటీల విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: సంస్కృతీ సంప్రదాయాలను సంరక్షిస్తేనే సమాజ వికాసం సాకారం అవుతుందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక యర్రమిల్లివారి వీధిలోని హనుమాన్ మందిర్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన 19వ భారతీయ సంస్కృతీ ఉత్సవ్–24 పోటీల విజేతలకు డీఎస్పీ గురువారం బహుమతులు అందజేశారు. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తన వంతుగా ప్రోత్సహిస్తున్న ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ సేవలను డీఎస్పీ ప్రసాద్ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా, ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీల్లో దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో దాదాపు 50 మంది విజేతలకు బహుమతులను డీఎస్పీ అందజేశారు. పోటీల నిర్వాహకుడు, సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్ మాట్లాడుతూ సంస్కృతీ ఉత్సవ్ పోటీలకు తల్లిదండ్రులు తమ పిల్లలను స్వయంగా తీసుకు వచ్చి సంప్రదాయ దుస్తులు, వేషధారణలు, పలు పురాణ ఇతిహాసాల పట్ల అవగాహన పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాల పట్ల విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకుడు సుదర్శన్‌కు ది ఐడియల్ టీచర్ అవార్డును డీఎస్పీ అందించారు. ట్రస్ట్ ప్రతినిధి యు.శివకృష్ణ, యువజన నాయకుడు పిండి రాజా తదితరులు పాల్గొన్నారు.

మాలల మహా గర్జన విజయవంతం చేస్తాం

అమలాపురం రూరల్: గుంటూరులో ఈ నెల 15న జరిగే ఆంధ్రప్రదేశ్ 26 జిల్లాల మాలల మహాగర్జనను విజయవంతం చేస్తామని, దీనికి జిల్లా నుంచి 50 వేల మంది మాలలు తరలి వెళ్లనున్నట్లు జిల్లా మాల మహానాడు నాయకులు తెలిపారు. అమలాపురం మండలం ఈదరపల్లిలో జిల్లా దళిత సాధన సమితి కన్వీనర్ జంగా బాబూరావు అధ్యక్షతన జిల్లా ముఖ్య నేతల సమావేశం గురువారం జరిగింది. మహా గర్జనకు జిల్లాల నుంచి బయలుదేరే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రఘుబాబు మాట్లాడుతూ జిల్లా నుంచి కార్లు, బస్సులు తదితర 2 వేల వాహనాలపై 50 వేల మంది వెళ్లనున్నట్లు తెలిపారు. 15న ఉదయం 11 గంటలకు రావులపాలెం సెంటర్ మీదుగా ఈతకోట హైవేపై అంబేడ్కర్ సెంటర్‌కు వేలాది మంది చేరుకుని, అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల చేసి గుంటూరుకు తరలి వెళ్తామన్నారు. దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నోటికొచ్చినట్లు మాట్లాడి, మాదిగలను రెచ్చగొట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. పీవీ రావు బలిదానంతో ఆగిపోయిన వర్గీకరణను ప్రాణాలొడ్డి కాపాడుకుంటామని, ఎందరో గడిచిన 19 ఏళ్లుగా వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఇది ఆఖరి పోరాటమని, కేవలం మంద కృష్ణ మాదిగ ఆడుతున్న నాటకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని కాలం చెల్లిన వర్గీకరణ అమలు చేస్తే మాలలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి, నేల కిషోర్, గెడ్డం సంపదరావు, నాయకులు కోటా రామ్మోహనరావు, గెడ్డం సురేష్‌బాబు, గొల్లపల్లి డేవిడ్, బడుగు జేమ్స్‌పాల్, నెల్లి లక్ష్మీపతి, రేవు తిరుపతిరావు, నల్లా నరసింహమూర్తి, పొలమూరి మోహన్‌బాబు, కప్పల శ్రీధర్, నాగవరపు వెంకటేశ్వరరావు, సరెళ్ల రామకృష్ణ, వడ్డి శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా దళిత సాధన సమితి కన్వీనర్ బాబూరావు


ఉత్తరం...సరికొత్త పరిచయం

- లేఖా రచనకు ప్రోత్సాహం
- విద్యార్థులకు తపాలా శాఖ పోటీలు
- రేపటితో ముగియనున్న గడువు

రాయవరం: ఒకప్పుడు సుదూర ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులు, బంధువుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉత్తరాలనే ఆశ్రయించేవారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పాటు, ఉద్యోగాలకు దరఖాస్తుల నుంచి భర్తీ వరకూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, ఈ–మెయిల్స్, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. సెల్‌ఫోన్ వినియోగం తర్వాత ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ వాడకం పెరగడంతో సమాచార వ్యవస్థలో విప్లవం వచ్చిందని చెప్పవచ్చు. నేటి తరానికి ఇంచుమించుగా ఉత్తరం అంటే తెలియని పరిస్థితి ఉంది. అందుకే ఉత్తరాన్ని తిరిగి పరిచయం చేసేందుకు, తెలిసిన వారికి మరోసారి గుర్తు చేసేందుకు తపాలా శాఖ గతేడాది నుంచి లేఖరులకు ముఖ్యంగా విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది.

'ది జాయ్ ఆఫ్ రైటింగ్'
ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్నవారి క్షేమ సమాచారం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను, పేపరు తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా లేదు. ఖండాంతరాల్లో ఉన్నవారితో సైతం వీడియో కాల్ ద్వారా మాట్లాడే పరిస్థితి ఉండడంతో లేఖల ద్వారా ఉత్తర, ప్రత్యుత్తరాలను మర్చిపోయిన పరిస్థితి ఉంది. ఒకప్పటి సమాచార సాధనమైన ఉత్తరాన్ని నేటి యువతరానికి గుర్తు చేసేందుకు తపాలా శాఖ లేఖా రచన పోటీలకు శ్రీకారం చుట్టింది. 'ది జాయ్ ఆఫ్ రైటింగ్' అనే అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఢాయి అఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.





రామచంద్రపురం కళాశాలలో పోటీల్లో పాల్గొని ఉత్తరాలు రాస్తున్న విద్యార్థులు

రెండు విభాగాల్లో..
ఈ పోటీల్లో 18 ఏళ్ల లోపు వారికి ఓ కేటగిరీ, పైబడిన వారిని మరో కేటగిరీగా విభజిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌళిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను అందులో పొందుపర్చాలి. ఎ–4 సైజ్ పేపర్‌పై రాసి ఎన్వలప్ కవర్‌లో ఉంచి పంపించవచ్చు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌ల్యాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాలి. కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్ సాధనాల్లో టైప్ చేసిన లేఖలను పోటీకి అనుమతించరు. చేతితో రాసి వ్యాసం పంపాలి. లేఖలను పంపించేవారు వారి వయసును నిర్ధారిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పోటీలో గెలిస్తే వారి వయసు, ఐడీ ధ్రువీకరణకు అవసరమైన పత్రాలు ఇవ్వాలి. ఇలా రాసిన ఉత్తరాలను స్థానిక పోస్ట్‌మేన్‌లు సేకరించి, స్టేట్ ఆఫీస్‌కు 'ది చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ–520013 చిరునామాకు పంపిస్తారు. వీటిని ఈ నెల 14 లోగా ఇవ్వాలి.



అమలాపురం హెడ్ పోస్టాఫీస్

బహుమతులిస్తారిలా..
రెండు కేటగిరీల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (12 మందికి మించకుండా) నగదు బహుమతులు అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులకు వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తారు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల వారికి వరుసగా రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు నగదును అందిస్తారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..
అమలాపురం డివిజన్ పరిధిలో రెండు హెడ్ పోస్టాఫీస్‌లు, 39 సబ్ పోస్టాఫీస్‌లు, 197 బ్రాంచి పోస్టాఫీస్‌లు ఉన్నాయి. గతేడాది నిర్వహించిన పోటీల్లో 3,145 మంది ఉత్తరాలు రాశారు. ఈ ఏడాది ఐదు వేల మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 2,500 మంది పోటీల్లో భాగంగా ఉత్తరాలు రాశారు. ఈ నెల 14తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో లక్ష్యాన్ని పోస్టల్ శాఖ చేరుకోవాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



తపాలాశాఖ రూపొందించిన ఉత్తరాల పోటీని పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చక్కని అవకాశంగా భావించాలి. విద్యార్థులే కాకుండా వయసుతో పనిలేకుండా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఇచ్చిన అంశానికి సంబంధించి స్వదస్తూరీతో వ్యాసం రాసి పోస్ట్ చేయాలి.

– ఆర్.నవీన్‌కుమార్, పోస్టల్ సూపరింటెండెంట్, అమలాపురం

అవగాహన కల్పించాం



విద్యార్థులకు ఉత్తరాలను పరిచయం చేయడం, వారికి లేఖారచనలో పోటీలు నిర్వహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అలాగే విద్యార్థుల్లో పోటీతత్వం కూడా పెరుగుతోంది. ఇప్పటికే రామచంద్రపురం సబ్‌డివిజన్ పరిధిలో కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించి, పోటీలు నిర్వహించాం. ఉత్తరాలు రాసే అలవాటు కూడా పెరుగుతుంది.

– నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, హెడ్ పోస్ట్‌మాస్టర్, రామచంద్రపురం

క్లుప్తంగా

హాస్టల్‌లో మందుబాబుల దోపిడీ


నిందితులను చూపి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్

పిఠాపురం: స్థానిక సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లో 9వ తేదీ అర్ధరాత్రి విద్యార్థులను బెదిరించి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు పిఠాపురం పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక రథాలపేటకు చెందిన పూడి గంగాధర్ (బాలు), అతని స్నేహితుడు, కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానంద (పాలు) మద్యం తాగి డబ్బుల కోసం పిఠాపురంలోని సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లోకి గోడ దూకి లోపలకు ప్రవేశించారు. హాస్టల్‌లో నిద్రిస్తున్న 8, 9, 10 తరగతి విద్యార్థులు ఉండే గదుల్లోకి వెళ్లి వారిని భయభ్రాంతులకు గురిచేశారు. బీరు బాటిళ్లు పగలగొట్టి దానితో పొడిచి చంపుతానని బెదిరించారు. పిల్లల వద్ద ఉన్న డబ్బులు పూర్తిగా ఇవ్వాలని, లేకపోతే చంపుతామంటూ బెదిరించి సుమారు రూ.540 బలవంతంగా వసూలు చేసి పరారయ్యారు. ఈ సంఘటనపై హాస్టల్ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గురువారం నిందితులను అరెస్టు చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచామని సీఐ వివరించారు.

ఎన్నికల్లో ఎన్ని వింతలో..

- నీటి సంఘాల ఎన్నికల్లో ఇష్టారాజ్యం
- ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో అస్తవ్యస్తంగా విభజన
- పిఠాపురం ఏలేరు ఆయకట్టులో 400 మంది ఓట్లు గల్లంతు
- ఏలేరుతో సంబంధం లేనివారికి ప్రాధాన్యం
- ఆధిపత్యానికి చక్రం తిప్పుతున్న టీడీపీ నేత


ఏలేరు కాలువ

పిఠాపురం: సాగునీటి సంఘాలకు రెండు అంచెల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 14న సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే నీటి సంఘాల ఎన్నికల్లో కొందరి ఇష్టారాజ్యం సాగుతోంది.. ఈ ఎన్నికల్లో అర్హులకు ఎగనామం పెట్టి తమకు అనుకూలమైన రైతులకు పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాకాలో జరుగుతున్న ఈ తంతుపై రైతాంగం మండిపడుతోంది. ఏలేరు పరివాహక ప్రాంతాల్లో అత్యంత కీలకమైన పిఠాపురం నియోజకవర్గంలో నీటి సంఘాల విభజన, విలీనాలపై అభ్యంతరాలు వ్యక్తమైనా జరిగేది జరిగిపోతోంది. శాస్త్రీయత లేని విభజనతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు చెబుతున్నా.. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినా జిల్లా అధికారులు పట్టించుకోక పోవడంతో వందల మంది రైతులు తమ ఓటుతో పాటు సాగునీటి సరఫరాపై హక్కులను కోల్పోతున్నారు. నియోజకవర్గంలో కొన్ని గ్రామాలను సంఘాల్లో చేర్చకపోవడం, సంబంధం లేని డీసీల్లో విలీనం చేయడం పిఠాపురం నియోజకవర్గ ఏలేరు రైతాంగానికి తీరని నష్టంగా మారింది. నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో నీటి పారుదల శాఖ చేపట్టిన ప్రాదేశిక నియోజకవర్గాల విభజన రైతులను నట్టేట ముంచేలా ఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

అటు ఇటు మార్పులు..

ఏలేరు ఆయకట్టుపై జగ్గంపేట, ఏలేశ్వరం, పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లో వ్యవసాయం జరుగుతోంది. ఏలేరు ప్రాజెక్టుపై 2003 నుంచి ఇప్పటి వరకూ ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు జరిగేవి. తాజాగా ఏలేరు ఆధునీకరణకు భారీగా నిధులు విడుదల చేసే అవకాశం ఉండడంతో వాటిపై పెత్తనం చెలాయించడానికి మెట్ట ప్రాంత టీడీపీ నేత ప్రోద్బలంతో డీసీల సంఖ్యను ఆరుకు పెంచడంతో పాటు నీటి సంఘాలు 30కి పెంచడం, ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. దీనిపట్ల ఏలేరు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం మండలం రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు నీటి సంఘాలు ముక్కొల్లు డీసీలో ఉండేవి. అధికారులు ఈ గ్రామాలను డీసీ నుంచి తొలగించారే తప్ప మరో డీసీలో కలపలేదు. దీనివల్ల ఈ గ్రామాల్లో సుమారు 400 మంది రైతులు తమ ఓటు హక్కును కోల్పోగా, వేలాది మంది నీటి పారుదలపై తమకు ఉన్న హక్కులను కోల్పోయారు. భవిష్యత్తులో నీటి సమస్యలు, కాలువ ఆధునీకరణకు సంబంధించి ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితిలోకి వెళ్లిపోయామని రైతులు వాపోతున్నారు. తమను ఓటరు జాబితాలో చేర్చలేదని ఆందోళన వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోలేదని అంటున్నారు. పిఠాపురం మండలం ఏలేరు ఆయకట్టుపై పి.దొంతమూరు, పి.రాయవరం కమిటీలు కిర్లంపూడి డీసీలో ఉండేవి. వాటిని ఆ డీసీ నుంచి తొలగించి ఎక్కడో దూరంగా ఉన్న ముక్కొల్లు, కిర్లంపూడి డీసీలో కలిపారు. పెద్దాపురం డీసీలో ఉండే మల్లాం, మంగితుర్తి గ్రామాలను అక్కడ తొలగించి గొల్లప్రోలులో కలపడంపై మల్లాం, జల్లూరు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక కాలువపై సాగు చేసే గ్రామాల రైతులను ఒక కాలువపై కాకుండా వివిధ కాలువలకు గ్రామాలకు విభజించడం ఏంటని ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోడం లేదని వాపోతున్నారు.

హైకోర్టు ఆదేశించినా..



నీటి సంఘాల అస్తవ్యస్త విభజనపై పిఠాపురం ఏలేరు ఆయకట్టు రైతులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన హైకోర్టు నీటి సంఘాల విభజనపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అయినప్పటికీ ఏఒక్క అధికారి పట్టించుకోలేదు. తమకు ఓట్లు లేకుండా పోతున్నాయని మొరపెట్టుకోగా అధికారులు వచ్చి విచారణ చేసి వెళ్లి పోయారే తప్ప ఏ ఒక్కరికి ఓటు హక్కు కల్పించలేదు. ఒకపక్క రైతులు ఆందోళన చేస్తున్నా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. రైతులకు అన్యాయం చేస్తూ నీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండడంపై ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టి సారించాలి.

– ఎం.శ్రీనివాసరెడ్డి, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం

మా హక్కులు కాలరాశారు



పూర్వం నుంచి భూములు పండించుకుంటూ సాగునీటి హక్కును కలిగి ఉన్న మా గ్రామ రైతుల హక్కులను అధికారులు కాలరాశారు. వందల మంది రైతుల ఓటు హక్కును తీసేశారు. ప్రతి నిత్యం కాలువలపై తిరిగే మాకు హక్కు లేకుండా ఎక్కడో ఉన్న ముక్కొల్లు కాలువపై కమిటీలో కలిపారు. ఇలాంటి విభజన ఎప్పుడూ లేదు. ఎంత మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోడం లేదు. ఎవరికి చెప్పినా వినే నాథుడు లేడు. ఎవరి కోసం ఇదంతా చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సాగునీటి సంఘాల ఎన్నికలు అంతా రైతులకు అన్యాయం చేయడానికే చేస్తున్నట్టు కనిపిస్తోంది.

– వీరపురెడ్డి వెంకటరమణ, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం

నన్నయ వర్సిటీ ఆర్చరీ జట్ల ఎంపిక


ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న ఆచార్య సుధాకర్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ ఆర్చరీ (విలువిద్య) మెన్ అండ్ ఉమెన్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ గురువారం ప్రారంభమయ్యాయి. దీనికోసం నిర్వహించిన పోటీలను రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ ప్రారంభించారు. ఏకలవ్యుని మాదిరిగా ఏకాగ్రతతో లక్ష్యాలను సాధించాలని ఆయన అన్నారు. ఇండియన్ రౌండ్ ఆర్చరీ విధానంలో జరిగిన పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో టి.అజయ్ (ఎస్‌కేవీటీ రాజమహేంద్రవరం), పి.కృష్ణ (సీబీఆర్, పిఠాపురం), యు.మహేష్‌బాబు, వి.వెంకటప్రసాద్ (జీడీసీ చింతలపూడి)లు ఉన్నారు. అలాగే మహిళా విభాగం నుంచి డి.మానస, జి. నవ్యమమత (ఏఎస్‌డీ కాలేజీ, కాకినాడ), జి.సావిత్రి, సీహెచ్ అంజలి (జీడీసీ చింతలపూడి) ఉన్నారు. వీరు ఈ నెల 22 నుంచి 26 వరకూ భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీలు వి.సాల్మన్, దేవానంద్, అబ్జర్వర్ డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, సెలక్షన్ కమిటీ సభ్యులు అలీ, విజయ్‌కుమార్, పీఈటీలు ఆర్.సాంబశివరావు, డాక్టర్ బి.రామ్‌గోపాల్, డాక్టర్ బాల సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ జేఎస్ఎస్ గోపాలకృష్ణ, టి.లక్ష్మణ్, డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరులో జరిగిన హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదుతోపాటు రూ. రెండు వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 5వ అదనపు సెషన్స్ జడ్జి డి.విజయ్‌గౌతమ్ గురువారం తీర్పు చెప్పారు. కొంతమూరుకు చెందిన తోట కనకదుర్గను 2020లో అయినశెట్టి నరసింహరాజు హతమార్చాడు. అతనిపై అప్పటి ఎస్సై ఐ.నాగబాబు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ఎంవీ సుభాష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారని సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

- సకాలంలో వైద్యం అందలేదని బంధువుల ఆరోపణ
- గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన


డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

గోకవరం: పురుగు మందు తాగిన వ్యక్తికి సకాలంలో వైద్యం అందక మృతి చెందాడంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు. ఆ వివరాల ప్రకారం.. గోకవరానికి చెందిన కాళ్ల రాజమల్లి (35) తాపీపని చేస్తూ జీవినం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని హుటాహుటిన గోకవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన బంధువులు అతని మృతదేహంతో గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పురుగు మందు తాగిన రాజమల్లిని హుటాహుటిన గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తే డ్యూటీ డాక్టర్ గంట వరకూ పట్టించుకోలేదని ఆరోపించారు. తామే ఉప్పు నీళ్లు పట్టించామని, కనీసం చెయ్యి పట్టుకుని కూడా చూడలేదని వాపోయారు. గంట సేపు వైద్యం అందించకపోవడంతో మృత్యువాత పడ్డాడని, వైద్యం అందించి ఉంటే బతికేవాడన్నారు. ఈ విషయం తెలుసుకున్న గోకవరం ఎస్సై పవన్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకునే వరకూ ఆందోళన విరమించేది లేదని, అవసరమైతే జిల్లా కలెక్టర్ వద్దకు వెళతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఫోన్‌లో మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడగా తమకు న్యాయం చెయ్యాలని కోరారు. అనంతరం కోరుకొండ సీఐ సత్యకిశోర్ సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి మృతుని బంధువులతో మాట్లాడుతూ ఘటనపై విచారణ నిర్వహించి బాధ్యులపై రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా గత నెల 23న గోకవరం ఫారెస్ట్ ఠాణాలో ఠాణాదార్‌గా విధులు నిర్వహిస్తున్న బీర బోయిన వెంకటలక్ష్మి ప్రసవం సమయంలో వైద్యం వికటించి మృత్యువాత పడింది. దీంతో ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ప్రజల వద్ద నుంచి వినిపిస్తున్నాయి.


రాజమల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఘటనపై డీసీహెచ్ఎస్ విచారణ

వైద్యం అందక వ్యక్తి మృతి చెందాడన్న ఆరోపణలపై రాజమహేంద్రవరం డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.పద్మశ్రీరాణి విచారణ నిర్వహించారు. ఉదయం గోకవరం ప్రభుత్వాసుపత్రిలో విచారణ చేపట్టి ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజకుమారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

అణచివేత ఉన్నచోట తిరుగుబాటు ఉండాలి

జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో 'వెన్నెల గద్దర్'


పి.గన్నవరంలో గద్దర్ జాతీయ పురస్కారాన్ని అందిస్తున్న వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: అణచివేత ఉన్నచోట తిరుగుబాటు ఉండాలని, అప్పుడే న్యాయం జరుగుతుందని ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న 110 మందికి మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో గురువారం పి.గన్నవరం సాయితేజ విద్యాసంస్థల ప్రాంగణంలో గద్దర్ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ ఆశయాలు, లక్ష్యాలను ముందే నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఎన్నో ఇబ్బందులు పడి 69 ఏళ్ల పాటు ఇక్కడి మహిళలు, ప్రజలు, పేదలకు విశేష సేవలు అందించిన మదర్‌థెరిసాను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తన పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వనని, టీవీ చూపించనని, గద్దర్ పాటలు వినిపిస్తానని వెన్నెల వెల్లడించారు. తన తండ్రి గద్దర్ పేరున సేవా పురస్కారాలు అందించిన కోరుకొండ జాన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా స్ఫూర్తిదాయక కథలు, పాటలతో ఆమె అలరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగినా గద్దర్ అక్కడికి వెళ్లి పోరాటం సాగించేవారన్నారు. అనంతరం వెన్నెలను సత్కరించారు. జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్, అరిగెల బలరామ్మూర్తి, అన్నాబత్తుల అనుబాబు, ముదునూరి లతేంద్రవర్మ, దాసరి రత్నం, కె.చక్రవర్తి, నల్లా పెద కాపు, ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని హుండీ ఆదాయం రూ.56.01 లక్షలు


ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.56.01 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని గురువారం తెలిపారు. సెప్టెంబర్ 26 నుంచి ఈ నెల 12 వరకూ 78 రోజులకు గాను బంగారం 94.100 గ్రాములు, వెండి 552 గ్రాములు, అన్నదాన హుండీల ద్వారా ఆదాయం రూ. 1,09,670 సమకూరిందని ఆమె వెల్లడించారు. ఆ శాఖ రామచంద్రపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రాంప్రసాద్, అర్చక, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పాదుకారాధన

- ఆంధ్రా భద్రాద్రికి తులగిరి శ్రీరామక్షేత్రంగా నామకరణ
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి


ప్రత్తిపాడులో ప్రసంగిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి

ప్రత్తిపాడు: ఆంధ్రా భద్రాద్రిగా పిలిచే ప్రత్తిపాడు నరేంద్రగిరిపై శ్రీరామనామ దివ్య క్షేత్రంలో గురువారం శ్రీరామ పాదుకాపట్టాభిషేకం వైభవోపేతంగా జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో ఈ పూజాగ్రంథం జరిగాయి. ఈ క్షేత్రంలో వందలాది మంది మహిళలతో శ్రీరామపాదుకా పట్టాభిషేక పూజలను ఆయనే స్వయంగా చేయించారు. ఈ సందర్భంగా చిన జీయర్ స్వామి మాట్లాడుతూ ప్రత్తిపాడు ప్రాంతం విశిష్టమైందన్నారు. ఓ వైపు పచ్చని పంట భూములు, మరో వైపు ఎత్తైన గిరులతో ఉన్న ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుతుందన్నారు. శ్రీరాముని ఆదర్శాలను అనుసరించడమే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలన్నారు. ధర్మ పరిరక్షణలోనూ ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, శ్రీరామనామ క్షేత్రం అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు తేజోమూర్తుల సుబ్రహ్మణ్యం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వికాస తరంగిణీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కర్రి పాపారాయుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రాభద్రాద్రి ఇకపై తులగిరి శ్రీరామ దివ్య క్షేత్రంగా బాసిల్లుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. ఆంధ్రాభద్రాద్రిని తులగిరి శ్రీరామక్షేత్రంగా నామకరణ చేశారు.

శ్రీరాముడి నామ స్మరణతో మార్మోగిన ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో శ్రీరామపాదుకా పట్టాభిషేకం పూజా కార్యక్రమానికి విచ్చేసిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి శ్రీరామ పాదుకలతో శోభాయాత్రగా ఆంధ్రాభద్రాదికి చేరుకున్నారు. ప్రత్తిపాడు మెయిన్‌రోడ్డు, అటవీశాఖ చెక్‌పోస్టు, జాతీయ రహదారి మీదుగా వేదిక వద్దకు చేరుకుంది. దారి పొడవునా జైశ్రీరామ్ నామ స్మరణలతో గ్రామం హోరెత్తింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, కోలాటాల బృందం తదితర వాయిద్య బృందాలు ఈ యాత్రలో పాల్గొన్నాయి. కాగా చిన జీయర్ స్వామిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడులో దర్శించుకున్నారు.


ప్రత్తిపాడు శ్రీరామనామ క్షేత్రంలో సామూహిక శ్రీరామ పాదుకారాధనలో పాల్గొన్న భక్తులు